


# బెల్టు కిక్కు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపులు

- పల్లెల్లో విచ్చలవిడిగా దుకాణాల నిర్వహణ
- చీప్ లిక్కర్ నుంచి అన్ని బ్రాండ్ల అమ్మకాలు
- కిరాణా దుకాణాల మాటున అడ్డగోలుగా దందా
- నిత్యం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు..

చుక్క.. ముక్క..కిక్కు.. పల్లెల్లో నేడు ట్రెండ్‌గా మారిపోయింది. వేకువజాము మొదలు.. అర్ధరాత్రి వరకు.. చీప్ లిక్కర్ నుంచి కాస్లీ మందు వరకు.. ఏ బ్రాండ్ కావాలన్నా.. కేరాఫ్ బెల్ట్‌షాపులుగా పరిస్థితి తయారైంది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపుల ఊసే లేకుండా చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు నేడు అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు పెంచడంతోపాటు విచ్చలవిడిగా పేద, సామాన్య మందుబాబుల 'బెల్ట్' తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ప్రతి గ్రామంలో గల్లీకొక దుకాణం ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం, అధికారుల నిఘా లేకపోవడంతో బెల్ట్ దుకాణాల దందా జోరుగా సాగుతున్నది.

– కల్వకుర్తి, మే 31

- చేసిన కష్టం తగలేస్తున్నారని కుటుంబాల ఆవేదన
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు


కల్వకుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్న, పెద్ద గ్రామాలు కలుపుకొని దాదాపు 150 వరకు బెల్ట్ దుకాణాలు ఉన్నాయి. కల్వకుర్తి వంటి మున్సిపాలిటీలో సైతం బెల్టు దుకాణాలు ఉన్నాయంటే ఏ రేంజ్‌లో బెల్ట్ దుకాణాల హవా నడుస్తున్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. బెల్ట్ దుకాణాల వల్ల గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. చాలా వరకు కిరాణ దుకాణాల్లోనే బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండడంతో ఎల్లప్పుడూ మద్యం అందుబాటులో ఉంటున్నది. బెల్టు షాపుల్లో సిట్టింగ్ సౌకర్యం, చికెన్, మటన్, తినుబండారాలు అందుబాటులో ఉంటున్నాయి.

**కూలీతో పాటు మద్యం..**

గ్రామాల్లో ప్రతి పనికి మద్యం ఇవ్వాల్సిందే. ఇదే క్రమంలో వరినాటు వేసేటప్పుడు కూలీలకు కూలితో పాటు మద్యానికి డబ్బులు ఇవ్వాల్సిందే. నాటు వేసిన కూలీలకు ఎకరాకు ఒక ఫుల్ బాటిల్ ఇవ్వాలి. కలుపు దేవేటప్పుడు కూడా అదే పద్ధతి. ఇలా ప్రతి పనికి డబ్బుల తోపాటు మద్యం అలవాటుగా మారుతోంది. దీంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి.

**తెల్లారంగానే బెల్ట్ దుకాణాల వద్దకు..**

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు అందుబాటులో ఉండటంతో తెల్లవారంగానే మందుబాబులు బెల్ట్ దుకాణాల వద్ద తచ్చాడుతున్నారు. సాయంత్రం కూలీ డబ్బులు చేతికి రాగానే నేరుగా బెల్ట్ దుకాణాలకు వెళ్తున్నారు. మద్యంతో పాటు గుడుంబా కూడా బెల్ట్ దుకాణాల్లో అందుబాటులో ఉంటున్నది. దీంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్స్ నుంచి మాత్రమే మద్యాన్ని కొనుగోలు చేయాలి. ఎక్కువ మొత్తంలో మద్యాన్ని ఇండ్లల్లో నిల్వ ఉంచుకోకూడదు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచితే మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తారు. ఇంతటి కఠినమైన నిబంధనలు ఉన్నా బహిరంగంగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకొని మద్యం అమ్ముతున్నారంటే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, వంగూర్ మండలాల్లోని పలు గ్రామాల వ్యవసాయ పొలాల్లో గుడుంబా తయారు చేస్తారన్నది బహిరంగ రహస్యమే. మద్యం క్రయవిక్రయాలపై నిబంధనలు అమలు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ చూసీ చూడనట్లు ఉండటం వెనుక కారణం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్దఎత్తున మద్యం దుకాణాల ద్వారా మామూళ్ల దందా జరుగుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల కారణంగానే బెల్ట్ దుకాణాల దందా సవ్యంగా సాగుతుందని యువజన సంఘాల నేతలు అంటున్నారు.





**బెల్ట్ షాపులను అరికడతాం**

గ్రామీణ ప్రాంతాల్లో వెలిసిన మద్యం బెల్ట్ దుకాణాలను అరికడతాం. ఇప్పటికే ఈ షాపులపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. విచ్చలవిడిగా వెలుస్తున్నాయని ఎవరు ఫిర్యాదు చేసినా దుకాణదారులపై చర్యలు తీసుకుంటున్నాం. కేసులు సైతం నమోదు చేస్తున్నాం. మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంత ప్రజలు మద్యం బెల్ట్ దుకాణాల నుంచి ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడినా నేరుగా జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

**- గాయత్రి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్**



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం



జలకళను సంతరించుకున్న తుంగభద్ర డ్యాం

## జూరాలకు తగ్గిన వరద

గద్వాల, మే 31 : జూరాలకు వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు గేట్లను మూసివేశారు. శనివారం 25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, అవుట్ ఫ్లో 28,602గా నమోదైంది. విద్యుత్ ఉత్పత్తికి 26,817, నెట్టెంపాడ్ కాల్వకు 1,500, జూరాల కుడికాల్వకు 240క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. జూరాల పూర్తిస్థాయి నీటి మట్టం 9.657కాగా, ప్రస్తుతం 8.357 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

**టీబీ డ్యాంకు పోటెత్తిన వరద**

అయిజ, మే 31 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 20,100 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 197 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ట నీటిమట్టం1,633 అడుగులకు గానూ ప్రస్తుతం 1,594.46 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుతం 15.61 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో 4,329 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 4,329 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు చేరుతోంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.

## బస్టాండ్‌ను మెరుగు పరుస్తాం..

మండల కేంద్రం లోని బస్టాండ్‌ను త్వరలో మెరుగు పరుస్తాం. ఇప్పటికే బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి బస్సులు నిలిచేలా చర్యలు తీసుకుంటాం.

**- ఉమాశంకర్, ఆర్టీసీ డీఎం, కొల్లాపూర్**



గద్వాల కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న రైతులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నేతలు

# మోకాళ్లపై కూర్చొని..

- గద్వాల కలెక్టరేట్ ఎదుట అన్నదాతల ఆందోళన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు
- సీడ్ ఆర్గనైజర్ల దోపిడీ అరికట్టాలని డిమాండ్

గద్వాల, మే 31 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమకు కష్టాలు దాపురించాయని రైతులు వాపోతున్నారు. విత్తనాలు కొనుగోలు మొదలు కష్టపడి పండించిన పంట అమ్ముకోవడం వరకు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం వానకాల పంటల సీజన్ ప్రారంభం కాగా.. సీడ్ ఆర్గనైజర్లు రైతులను మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతులంతా ఆందోళనకు దిగారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీగా కర్షకులు పెద్ద సంఖ్యలో ఐడీవోసీ వద్దకు చేరుకొని మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. సీడ్ పత్తి రైతులకు జరుగుతున్న డోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ పత్తి రైతులపై జరుగుతున్న మోసాన్ని అరికట్టడంలో అటు వ్యవసాయశాఖ అధికారులు, ఇటు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కంపెనీలు, ఆర్గనైజర్లు ప్రతి ఏడాది ఏదో రూపంలో రైతులను ముంచుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి కొన్ని కంపెనీలు ప్యాకెట్ ధర తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నాయని ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ధరలు ఉండాలి కానీ.. కంపెనీలు ధరలు తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. అన్నదాతలు కష్టపడి విత్తన పత్తి పండించి ఆర్గనైజర్లకు ఇస్తే వారు కంపెనీకు ఇస్తే జీవోటీ పేరుతో విత్తనాలు శాంపిల్స్ తీసి పాస్ అయినా ఫెయిల్ అయ్యాయని అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఇలా రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఆర్గనైజర్లతో పాటు కంపెనీలు వేధింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రైతులకు సంబంధించి ఫెయిల్ అయిన విత్తనాలకు రీ శాంపిల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో 35 వేల మంది రైతులు సీడ్ విత్తన పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. కంపెనీలు ఇచ్చే వాస్తవ విత్తనాలను ఆర్గనైజర్లు రైతులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కంపెనీలతో రైతులకు నేరుగా సంబంధాలు లేకపోవడం వల్ల ఆర్గనైజర్లు విత్తన ప్యాకెట్ ధరల విషయం లోనూ.. అడ్వాన్స్‌లు ఇచ్చే విషయంలోనూ.. రైతులను పలు రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. రైతులు పంట పండించిన తర్వాత డిసెంబర్ నెలలో ఆర్గనైజర్ల ద్వారా ఆయా కంపెనీలకు రైతులు విత్తన పత్తి ఇస్తున్నారని, అయితే ఈ విధంగా సేకరించిన పత్తి విత్తనాలకు జీవోటీ పరీక్ష నిర్వహించి ఫలితాలు రావడానికి రెండు నెలలు గడువు ఉంటుందని చెప్పారు. అయితే ఆర్గనైజర్లు మాత్రం మళ్లీ పంట సాగు చేసే వరకు రైతులకు వారు ఇచ్చిన విత్తనాల ఫలితాలు మాత్రం చెప్పకుండా.. పెట్టుబడి రూపంలో వారికి ఇచ్చిన అప్పుపై అదనపు వడ్డీలు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది రైతులను మోసం చేయడమే అన్నారు. జీవోటీ ఫలితాల్లో ఫెయిల్ కాకున్నా ఫెయిల్ అయినట్లు చూయిస్తూ రైతులకు చెల్లించాల్సి నగదు చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఇలా విత్తన పత్తి రైతును ఆర్గనైజర్లు, కంపెనీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం చెందారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. మోసాలు జరగకుండా కంపెనీలు, రైతులతో నేరుగా ఒప్పందాలు చేసుకోవాలని.. 2022 నుంచి ఇప్పటి వరకు ఫెయిల్ అయిన విత్తనాలను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కంపెనీలు, ఆర్గనైజర్లతో సమావేశం ఏర్పాటు చేశామని, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని వారిని ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు అన్యాయం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆందోళనలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులా.. బస్టాండ్

- పెంట్లవెల్లిలో నిరుపయోగం
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు గ్రామ యువకుడి ఫిర్యాదు



పెంట్లవెల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో సంచరిస్తున్న పందులు



బస్టాండ్ వెనుక భాగంలో నిలిచిన మురుగు

పెంట్లవెల్లి, మే 31 : పెంట్లవెల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ డంపింగ్ యార్డులా తయారైంది. బస్టాండ్ లేక ప్రయాణికులు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. బస్టాండ్ ఆవరణలో అర్టీసీ బస్సులకు బదులు ప్రైవేట్ వాహనాలు నిలుపుతున్నారు. చుట్టుపక్కల కాలనీవాసులు చెత్తాచెదారాన్ని తెచ్చి బస్టాండ్ ఆవరణలో పడేస్తున్నారు. ఇదేకాక బస్టాండ్ ఆవరణ చుట్టూ కంపచెట్లు పెరగడంతో స్వరూపమే మారిపోయింది. చివరకు బస్టాండ్ చుట్టూ ఉన్న స్థలాన్ని కొంత మంది కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన యువకుడు మూలె మేఘరాజు నాలుగు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సమస్యను వివరించారు. బస్టాండ్‌ను వినియోగం లోకి తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకుటామని చెప్పినట్లు తెలిపారు.

## రోడ్డు పనులు చేపట్టాలని రాస్తారోకో

- పనులను అడ్డుకోవడంపై గిరిజనులు ఆగ్రహం

హన్వాడ, మే 31 : మండలం లోని దొర్రితండాకు వెళ్లే రోడ్డు పనులను నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గిరిజనులు శనివారం మహబూబ్‌నగర్–తాండూర్ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ దొర్రితండాకు ఇటీవలే బీటీ రోడ్డు మంజూరైందని, ఈ మార్గంలోనే గుడి ఉండడంతో అక్కడ గుడి చుట్టూ దిమ్మె కట్టిచ్చేందుకు గ్రామస్తులు అంగీకరించారన్నారు. కాగా, మాజీ సర్పంచ్ మాత్రం దిమ్మె ఏర్పాటు చేయాలని పనులను అడ్డుకుంటున్నాడని తెలిపారు. రోడ్డు పనులను అడ్డుకోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాన రోడ్డుపై బఠాయించి నిరసన తెలిపారు.







# మరో సారీ

- పశువుల సంత వేలం వాయిదా
- ధర ఎక్కువగా ఉండడంతో గుత్తేదారుల నిరాసక్తత

కల్వకుర్తి, మే 31 : కల్వకుర్తి మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరుస్తున్న పశువుల సంత వేలం మరో సారి వాయిదా పడింది. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ మహమూద్ షేక్ ఆధ్వర్యంలో పశువుల సంతకు వేలం పాట నిర్వహించారు. పాల్గొన్న గుత్తేదారులు టెండర్ ధర చూసి చేతులెత్తేశారు. ధర ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఏమాత్రం గిట్టుబాటు కాదని, ఈ ధరకు టెండర్ తీసుకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని గుత్తేదారులు చెప్పారు.

**2024-25 సంవత్సరానికి..**

పశువుల సంత 2024–25 సంవత్సరంలో 9నెలల కాలానికి (జూన్ నుంచి మార్చి 31 వరకు) దాదాపు రూ.87లక్షలకు గుత్తేదారు టెండర్ దక్కించుకున్నారు. 2025–26 సంవత్సరానికి పశువుల సంత టెండర్‌కు మున్సిపల్ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ ధరను రూ.1.27కోట్లకు నిర్ణయిస్తూ వేలం పాట నిర్వహించారు. టెండర్ ధర గిట్టుబాటు కాదంటూ టెండర్‌దారులు నిరాసక్తత చూపించారు. టెండర్ కాకపోవడంతో మరో రెండు సార్లు అవే డీడీలపై టెండర్‌దారులతో మున్సిపల్ కమిషనర్ సమావేశమయ్యారు. చివరకు టెండర్ ధర రూ.1.17కోట్లుగా నిర్ణయిస్తూ వేలం పాట నిర్వహించినా టెండర్‌దారులు సంత నిర్వహణకు ముందుకు కాలేదు.

**మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంత నిర్వహణ..**

పశువుల సంతకు టెండర్ లేకపోవడంతో మున్సిపాలిటీ అధికారులు తమ సిబ్బందితో రెండు నెలలుగా సంతను నిర్వహిస్తున్నారు. ఏప్రిల్, మే నెల(రెండు నెలలు 10వారాలు)లుగా సిబ్బంది ఆదివారం పశువుల సంతను జరుపుతున్నారు. అధికారులు నిర్వహిస్తున్న పశువుల సంతలో పశువు క్రయ, విక్రయానికి రూ.750 వసూలు చేస్తున్నారు. దీంతో సరాసరిన నెలకు రూ.6లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని కమిషనర్‌ను అడగాలని యత్నిస్తే ఆయన అందుబాటులోకి రాలేదు.

**మరోసారి టెండర్లు**

శనివారం మున్సిపల్ అధికారులు పశువుల సంతకు టెండర్లు పిలిచారు. 5మంది టెండర్‌లో పాల్గొనేందుకు డీడీలు తీశారు. ఉదయం మున్సిపల్ కార్యాలయంలో టెండర్ దారులతో సమావేశమైన కమిషనర్ పశువుల సంతకు 9 నెలల కాలానికి రూ.1.17కోట్ల ధరను ప్రకటించారు. ధరను చూడగానే టెండర్‌దారులు అవాక్కయ్యారు. గత సంవత్సరం దాదాపు రూ.25లక్షలు నష్టపోయామని, ఇంత ధరకు టెండర్ తీసుకోలేమని గుత్తేదారులు చేతులేత్తేసి బయటకు వెళ్లిపోయారు. 9నెలల కాలానికి రూ.80లక్షల వరకు టెండర్ ఉంటుందని భావించగా, కోటికి పైగా టెండర్ ఉందని, ఈ ధరకు టెండర్ తీసుకుంటే నిలువునా మునగడం తప్పా మరేమీ ఉండదని గుత్తెదారులు వాపోయారు.

**పాలకమండలి లేకపోవడం వల్లే..**

మున్సిపాలిటీకి పాలకమండలి లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకమండలి ఉండి ఉంటే తీర్మానం చేసి అమలు చేసేవారు. గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నది. దీనికితోడు పశువుల సంఖ్య తగ్గిపోవడం, టెండర్ ప్రతి సంవత్సరం పెరుగుతూ రావడంతో నష్టం వచ్చే పరిస్థితి వచ్చింది. నష్టాన్ని పూడ్చుకోవడానికి గుత్తెదారు పశువుల క్రయవిక్రయాలకు రూ.750కి బదులు రూ.1,250 వసూలు చేయాల్సి వస్తుంది.



కల్వకుర్తిలో పశువుల సంత